సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 8 । మే । 2023



మల్లన్నసన్నిధి.. భక్తుల పెన్నిది

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మేకల మల్లేశం తదితరులు పరిశీలించారు.



వైభవంగా రథోత్సవం

జూలపల్లి(పెద్దపల్లి): కుమ్మరికుంటలోని శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ సంతోష్‌రావు ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అతి స్వల్ప వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

మంత్రివర్యా.. ఆలకించండి !



అంతర్గాంలో మూతపడ్డ స్పిన్నింగ్ మిల్లు



ఎల్లంపల్లి ప్రాజెక్టులో నిర్లక్ష్యంగా పడేసిన టూరిజం బోట్

- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- ఎన్నికల హామీలుగానే మిగిలిపోతున్న వైనం
- ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి స్థలం ఎంపికలో తాత్సారం
- మంత్రి కేటీఆర్‌పైనే ఆశలు

రామగుండం: రామగుండం నియోజకవర్గ పరిధిలోని సమస్యలు ఏళ్లుగా పరిష్కారం కావడం లేదు. అంతర్గాంలో మూతపడ్డ స్పిన్నింగ్‌మిల్‌ను తెరిపించాలనేది డిమాండ్‌గానే ఉంటుంది. బీపీఎల్ భూములు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధికి పడిన అడుగులు అక్కడితోనే ఆగిపోయాయి. మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ ఈనెల 8న రామగుండంలో పర్యటిస్తుండడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సమస్యలపై దృష్టి పెట్టాలని విన్నవిస్తున్నారు.

తెరుచుకోని అంతర్గాం మిల్లు

బర్మా, శ్రీలంక కాందీశీకులైన అంతర్గాం టెక్స్‌టైల్ కార్మికుల సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. 1985 జూన్‌లో మూతపడిన వీవింగ్ మిల్లులో 197 మంది కార్మికులు, నవంబర్ 1991లో స్పిన్నింగ్ మిల్లు లేఆఫ్ ప్రకటించడంతో 430 మంది ఉపాధి కోల్పోయారు. ఇందులో వీవింగ్ కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు రూ.86.38 లక్షలు, ప్రావిడెంట్ ఫండ్ రూ.12.97 లక్షలు ఉన్నాయి. ఇప్పటి వరకు 200 మంది కార్మికులు చనిపోయారు. టెక్స్‌టైల్ భూములు 502 ఎకరాలలో ప్రస్తుతం 102 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు కార్మికులకు వేతన బకాయిలు, నివేశన స్థలాల కోసం ఇచ్చిన మాటలు హామీలుగానే మిగిలిపోయాయి.

నిరుపయోగంగా కురుస్కం భూములు

స్వాతంత్ర్యానికి ముందు నిజాం ప్రభుత్వ హయాంలో 1946లో అజామాబాద్ ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటుకు అంతర్గాం మండల పరిధిలోని రాయదండి, అంతర్గాం, గోలివాడలకు చెందిన రైతుల నుంచి 3,696.32 ఎకరాలు సేకరించారు. ఎలాంటి పనులు జరుగకపోవడంతో వేలాది ఎకరాలు నిరుపయోగంగా మారాయి. రాయదండి శివారు పరిధిలో 1,165.18 ఎకరాలలో 147.14 ప్రతిపాదిత బీపీఎల్ విద్యుత్ కేంద్రానికి అప్పగించగా మిగతా 1,018.04 ఎకరాలు తమకు అప్పగించాలని 1986లోనే రాయదండి గ్రామస్తుడు హైకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది.

బీళ్లుగా బీపీఎల్ విద్యుత్ కేంద్రం భూములు

రామగుండంలో ప్రతిపాదిత బ్రిటీష్ ఫిజికల్ ల్యాబోరేటరీ(బీపీఎల్) విద్యుత్ సంస్థ నిర్మాణానికి 1994లో పలు గ్రామాల నుంచి 1,817 ఎకరాలు సేకరించారు. ముప్పై ఏళ్ల క్రితమే ప్రహరీ, ఇతరత్ర నిర్మాణాల పేరిట సుమారు రూ.వెయ్యి కోట్లు బీపీఎల్ వెచ్చించింది. సాంకేతిక కారణాలతో అర్ధంతరంగా నిలిపివేశారు. ఆ రోజుల్లో రెండు పంటలు సమృద్ధిగా పండించే వ్యవసాయ భూములను ఎకరాకు రూ.30వేలకు కొనుగోలు చేయగా ఇప్పటికీ బీళ్లుగానే ఉంటున్నాయి. ఇందులో కనీసం రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి అప్పగించి నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే డిమాండ్ ఉంది.

కాలంచెల్లిన బీ–థర్మల్‌కు నిలిపివేసిన నిధులు

రామగుండంలో 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి విద్యుత్ కేంద్రం. దీనిని 1965 జూలై 19న రూ.14.5 కోట్లతో నిర్మించారు. పదేళ్ల క్రితం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఏటా వార్షిక విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు సొంతం చేసుకున్న చరిత్ర బీ–థర్మల్ కేంద్రానిది. రెండేళ్ల క్రితం 25 ఏళ్లు దాటిన విద్యుత్ కేంద్రాలు కాలుష్యకారకాలుగా ఉంటాయని పేర్కొంటూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) దేశవ్యాప్తంగా పలు కేంద్రాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా సీఈఏ నివేదికలో పేర్కొన్న పారామీటర్స్‌కు లోబడి బీ–థర్మల్ విద్యుత్ ఉత్పత్తి నివేదిక ఉండడంతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఢిల్లీలో సీఈఏ చైర్మన్‌ను కలిసి కొనసాగింపునకు ఆదేశాలు జారీ చేయించారు. కాగా స్థానికంగా బొగ్గు, నీరు, స్థలం, రవాణా వ్యవస్థ అన్ని సమృద్ధిగా ఉండడంతో బీ–థర్మల్ కేంద్రానికి చెందిన భూములు సుమారు 400 ఎకరాలుండగా నూతనంగా 800 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రం స్థాపిస్తే తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చనే డిమాండ్ ఉంది.

ఈఎస్ఐ స్థలం ఎంపికలో తాత్సారం

రామగుండం కేంద్రంగా వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి స్థాపనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాగా రామగుండంలో ఆస్పత్రి నిర్మాణానికి ఏడు ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం కాగా.. పట్టణ పరిధిలోని ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఐదు ఎకరాలుండగా, ఎస్టీ కాలనీ సమీపంలోని మూతపడిన చెత్త డంపింగ్ యార్డు స్థలం పది ఎకరాలు అందుబాటులో ఉంది. కానీ ఇప్పటి వరకు అధికారికంగా ఆస్పత్రి నిర్మాణానికి స్థలం ఖరారు కాలేదు.

కలగానే ఎల్లంపల్లి టూరిజం

ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో రామగుండం నుంచి వెల్గటూర్ మండల పరిధిలోని కోటిలింగాల ఆలయానికి టూరిజం బోటింగ్ ఏర్పాటు, ప్రాజెక్టు వద్ద ఉద్యానవనాల నిర్మాణం ఊసేలేదు. ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటు చేయనున్నామని మూడేళ్ల క్రితం మంత్రి కొప్పుల ఈశ్వర్ కోటిలింగాలలో ప్రకటించారు. ఆ హామీ ప్రకటనకే పరిమితమైంది. ఫిషరీస్ కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలు కలగానే మిగిలిపోయాయి.

నిరుపయోగంగా వేలాది ఎకరాలు

రామగుండం నియోజకవర్గ పరిధి అంతర్గాం మండలంలో పరిశ్రమల స్థాపనకు, టెక్స్‌టైల్ భూములు వేలాది ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి లభ్యత ఊహించలేనిది. ప్రభుత్వం స్పందించి సదరు భూ సమస్యలను పరిష్కరించి పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దితే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలను సృష్టించవచ్చని స్థానికులు కోరుతున్నారు.

రామగుండం.. పేరుకే కార్పొరేషన్



నిలిచిన మల్టీ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్



డంపింగ్‌యార్డుగా మారిన గోదావరి తీరం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో అనేక సమస్యలు ఏళ్లుగా అపరిష్కృతంగానే ఉన్నాయి. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశ నగర ప్రజల్లో ఉంది. బల్దియాలో ప్రధానంగా డంపింగ్‌యార్డ్ సమస్య ఉంది. నగర సుందరీకరణకు మంత్రి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రి ఆవరణలో పబ్లిక్ పార్క్ నిర్మాణానికి రూ.350లక్షల అమృత్ స్కీం నిధులతో 2017 మార్చి 31న మున్సిపల్ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఆరేళ్లుగా పబ్లిక్ పార్క్ పనులు ముందుకు పడడం లేదు.
- రామగుండం నగరపాలక సంస్థలో డంపింగ్ యార్డ్‌కు సొంత స్థలం లేదు. గోదావరి తీరంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ దుర్వాసన దారుణంగా వస్తుంది.
- రామగుండం నగరాభివృద్ధికి సీఎంఏ గ్రాంట్స్ ద్వారా ఏటా రూ.100కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సక్రమంగా విడుదల కావడం లేదు. దీంతో పలు అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి.
- రూ.8కోట్లతో పాత మున్సిపల్ ఆవరణలో మల్టీ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, విఠల్ నగర్‌లో రూ.5కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.
- హనుమాన్‌నగర్‌లో రూ.4కోట్లతో ఆడిటోరియం, రూ.9.5 కోట్లతో కమ్యూనిటీ హాల్స్, రూ.2కోట్లతో సీనియర్ సిటిజన్ క్లబ్, రూ.3కోట్లతో స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం, రూ.కోటితో పశువైద్యశాల పనులు ఇంకా మొదలే కాలేదు.
- ప్రశాంత్‌నగర్‌లోని మల్కాపూర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే పనులు పూర్తి కాలేదు. పర్యవేక్షణ లేక చెరువు శిఖం కబ్జాలకు గురవుతోందనే ఆరోపణలు ఉన్నాయి.
- బల్దియాలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) లేక మురుగునీరంతా నేరుగా గోదావరిలో కలుస్తోంది. ఈ కారణంతోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్‌లు సాధించలేకపోతుంది.
- బల్దియాలో ప్రతీ ఇంటి నుంచి ఆస్తి పన్నులో నుంచి 8 శాతం లైబ్రరీ సెస్ కింద వసూలు చేస్తున్నప్పటికీ లైబ్రరీకి పక్కా భవనం లేదు.
- రామగుండం బల్దియా గ్రంథాలయశాఖకు ఏటా రూ.80 లక్షలకుపైగా లైబ్రరీ సెస్‌ను చెల్లిస్తోంది.
- లైబ్రరీ భవనాన్ని కూడా గ్రంథాలయసంస్థ నిర్మించలేదు. సింగరేణి అద్దె భవనంలో కనీస సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

పలు ఫిర్యాదులు

- బల్దియాలోని పలు విభాగాల అధికారులపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్తున్నాయి. శానిటేషన్‌లో వాహనాల కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయని విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు వెళ్లగా.. విచారణ చేపట్టారు.
- బల్దియా నుంచి సుమారు రూ.2కోట్లకుపైగా నిధులను పొందిన ఏజెన్సీ, రెండేళ్లు గడుస్తున్నా వాహనాలను సరఫరా చేయకపోవడంపై దర్యాప్తు చేస్తున్నారు. స్క్రాప్ చోరీ కావడం, నామినేషన్ పనులపై దర్యాప్తు సాగుతోంది.

అప్రమత్తమైన అధికారులు

- మున్సిపల్ మంత్రి కేటీఆర్ వస్తున్నారనగానే రామగుండం కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించారు.
- రెండేళ్లుగా నిలిచిన మున్సిపల్ నుంచి ఫైవింక్లయిన్ వరకు100 ఫీట్ల రహదారి పనులను పునర్ ప్రారంభించారు.
- మంత్రి కాన్వాయ్ ప్రయాణించే ఏరియాలో డివైడర్లలో కొత్త మట్టి పోసి మొక్కలు నాటించారు.

కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- హెలీకాప్టర్‌లో బెల్లంపల్లి నుంచి గోదావరిఖనికి..
- పోలీస్ కమిషనరేట్ భవనం ప్రారంభం
- మున్సిపల్ పైలాన్ ఆవిష్కరణ
- జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో బహిరంగ సభ



పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

గోదావరిఖని: రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పర్యటనకు భారీ ఏర్పాట్లు చేశారు. చాలా రోజుల తర్వాత మంత్రి కేటీఆర్ రామగుండం పర్యటనకు వస్తుండడంతో అధికార పార్టీ బీఆర్ఎస్ నేతలు భారీగా ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి బహిరంగ సభ నిర్వహించే గ్రౌండ్ వరకు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంత్రి కేటీఆర్‌తోపాటు సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, హోంమంత్రి మహమూద్ అలీ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో పాల్గొన్న తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు హెలీకాప్టర్ ద్వారా నేరుగా రామగుండం పోలీస్ కమిషరేట్ చేరుకోనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పోలీస్ కమిషనరేట్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అక్కడే పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 4 గంటలకు కోర్టుచౌరస్తా సమీపంలో పలు అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. 4.30 గంటలకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే బహిరంగసభకు చేరుకుంటారు. బహిరంగసభ అనంతరం సాయంత్రం 5.30 గంటలకు హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్ తిరిగి వెళ్లనున్నారు.

భారీ పోలీసు బందోబస్తు

మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీ ఆధ్వర్యంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 8 మంది ఏసీపీలు, 30 మంది సీఐలు, 70 మంది ఎస్సైలతో పాటు 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగించనున్నారు.

ఏర్పాట్లు పరిశీలన

రాష్ట్ర మంత్రి కేటీఆర్ బహిరంగసభ ఏర్పాట్లను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ బహిరంగసభ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

ఇండస్ట్రియల్ పార్కు ప్రారంభోత్సవంపై అస్పష్టత

రామగుండం: అంతర్గాంలోని ఇండస్ట్రియల్ పార్కుకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారని నాలుగు రోజులుగా విస్తృత ప్రచారం జరిగింది. మంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. పోలీసులు సైతం ముందస్తుగా భద్రత చర్యలపై సమీక్షించారు. కానీ మంత్రి పర్యటన షెడ్యూల్‌లో ఇండస్ట్రియల్ పార్కు శంకుస్థాపన అంశం లేకపోవడంతో రద్దయినట్లు సమాచారం వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆఖరి నిమిషంలో ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన రద్దవడంతో స్థానికులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఘాట్‌ను విస్తరించాం



ఘాట్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదుల గండి(చందులాల్ గండి)ని గత పాలకులు పట్టించుకోలేదని.. తాము అధికారంలోకి వచ్చాక విస్తరించామని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పేర్కొన్నారు. ఘాట్‌ను ఆదివారం సందర్శించిన సందర్భంగా మధు మాట్లాడారు. గండి ఇరుకుగా ఉండి అనేక ప్రమాదాలు జరిగాయని, చాలా మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే వారి కుటుంబం అమెరికాలో ఉండనే ఆలోచనతో ఇక్కడ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కానీ తాను పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా గండిని విస్తరించానని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మహనీయుల చరిత్ర చాటి చెప్పే బాధ్యత తీసుకున్నట్లు చెప్పారు. ఎంపీపీ కొండ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, మంథని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు మంథని లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, కొట్టె రమేశ్, గర్రెపల్లి సత్యం తదితరులు ఉన్నారు.

రైతులను పట్టించుకోవడం లేదు



మాట్లాడుతున్న ఈర్ల కొమురయ్య

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని.. పాలకులు పట్టించుకోవడం లేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్ల కొమురయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వరి సాగు మొదలు పంట చేతికొచ్చే వరకు ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. కేంద్రాల్లోని ధాన్యం తడిసిందని.. ఇప్పటికైనా తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనాలని కోరారు. విజయ్‌కుమార్, ప్రశాంత్ ఉన్నారు.

ముగిసిన మేడే వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలో నిర్వహించిన వారోత్సవాల ముగింపు ర్యాలీని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఎర్ర జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో చికాగో అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాది నాగలక్ష్మి, జూనియర్ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డల షర్మిల, పర్యావరణవేత్త ఉమామహేశ్వర్‌రావు, శంకర్, రామాచారి, లక్ష్మారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: శ్రమశక్తి అవార్డు గ్రహీతలను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ ఆదివారం సన్మానించారు. యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు పుట్ట రమేశ్, జనగామ శ్రీనివాస్‌గౌడ్, కొల్లూరి బాలయ్య, నాయిని శంకర్, దాసరి శ్రీనివాస్, పోలాడి శ్రీనివాసరావులను శాలువాలతో సన్మానించారు. ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్‌రావు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న మల్లేశ్



గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన తార ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మడిపల్లి మల్లేశ్ జాతీయ అవార్డు అందుకున్నారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. సినీనటులు ప్రీతినిగం, నగేశ్, భావనరెడ్డి పాల్గొన్నారు.

పోరాట యోధుల గురించి తెలుసుకోవాలి

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- సాయుధ పోరాటయోధుడు మురళీధర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



మురళీధర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

సుల్తానాబాద్‌రూరల్: నేటి యువత స్వాతంత్ర్య పోరాట యోధుల గురించి తెలుసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి చెందిన నిజాం విముక్త సాయుధ పోరాట యోధుడు గట్టెపల్లి మురళీధర్‌రావు కాంస్య విగ్రహాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ భానుప్రసాద్‌రావు, ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ సాధారణ జీవితం అనుభవించిన మురళీధర్‌రావు నిజాంను ఎదురించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సుల్తానాబాద్ కోర్టు వద్ద మూడుసార్లు చూసే అవకాశం లభించిందని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం మురళీధర్‌రావు జీవిత చరిత్ర పుస్తకం, పాటల సీడీలను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ రజాకార్లతో పోరాడిన మురళీధర్‌రావు తన గ్రామమే కావడం గర్వకారణంగా ఉందన్నారు. ఎంపీ వెంకటేశ్‌నేత మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్త మురళీధర్‌రావు కాంస్య విగ్రహం ఆవిష్కరణకు రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, జెడ్పీ వైస్‌చైర్మన్ రేణుక, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్ అరుణజ్యోతి, ఎంపీటీసీ శంకర్, మురళీధర్‌రావు కుమారులు సంపత్, వసంత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కాసులపల్లిలో గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక అధికారి, సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కాసులపల్లిలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రాజయ్యకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారమందించారు. సకాలంలో ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ సిబ్బంది సిరాజొద్దీన్, చంద్రయ్య, శ్రావణ్, నరేందర్ మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10వేల వరకు నష్టం జరిగింది.

రైలు కిందపడి సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మృతి



మాధవరెడ్డి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: రామగుండం ఎన్టీపీసీ మాతంగికాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి దొండేటి మాధవరెడ్డి(71) ఆదివారం పెద్దపల్లి శివారులో గూడ్స్‌రైలు కింద పడి మరణించాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాలు.. మాధవరెడ్డికి అనారోగ్య సమస్యలతోపాటు అప్పుల బాధ తీవ్రమైంది. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడికి భార్య సరోజతోపాటు కొడుకు, కూతురు ఉన్నారు. కుమారుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ చెప్పారు.

గుండెపోటుతో ఎన్టీపీసీ ఉద్యోగి..



సత్యనారాయణరెడ్డి (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థ ఉద్యోగి సత్యనారాయణరెడ్డి (59) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. సంస్థ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న సత్యనారాయణరెడ్డి(59) స్టేజ్–2 ఆఫ్‌సైడ్ ఆపరేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఇంట్లో అచేతనంగా పడి ఉండగా ఇరుగుపొరుగు వారు చూసి ధన్వంతరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య నీరజతోపాటు కుమారుడు, కూతురు అమెరికాలో ఉన్నారు. ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి కొలిపాక మల్లయ్య, కందుల స్వామి, బండారి కనకయ్య నివాళి అర్పించారు.

ఒగ్గు కళాకారుడికి నృత్యాంజలి పురస్కారం



అవార్డు అందుకుంటున్న రాజమల్లు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన ఒగ్గు కళాకారుడు మక్కెపల్లి రాజమల్లుకు ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నిర్వహించిన త్యాగరాయ గాన సభలో నృత్యాంజలి ఉగాది పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 75 మంది కళాకారులు, డాక్టర్ జవ్వాజి అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలి

రామగుండం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే విద్యుదుత్పత్తి కేంద్రాలకు రామగుండం ప్రసిద్ధి అని బీజేపీ జిల్లా నాయకుడు కుక్క గంగాప్రసాద్ అన్నారు. ఆదివారం రామగుండం పట్టణంలో ఆయన మాట్లాడారు. స్థానిక వనరుల లభ్యతను బట్టి నూతన విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఏర్పాటు చేసిన అజామాబాద్ పవర్ స్టేషన్ కొన్నేళ్లకే సాంకేతిక కారణాలతో మూతపడిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణకు నిధులు కేటాయింపుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు రామగుండం కేంద్రంగా 800 మెగావాట్ల సామర్థ్యంతో రెండు విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన చేసిందని పేర్కొన్నారు. ఆ తర్వాత తెలంగాణ సాధనతో అది మరుగున పడిందని తెలిపారు. సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ రామగుండం వస్తున్న నేపథ్యంలో నూతన విద్యుత్ కేంద్రం ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

మొగులు.. దిగులు

- అకాల వర్షాలతో అన్నదాతల్లో వణుకు
- కేంద్రాల్లోనే పడిగాపులు.. ఊపందుకోని కొనుగోళ్లు
- తూకం వేయాలని రైతుల వేడుకోలు

జిల్లాలో సాగైన వరి **2.05**లక్షల ఎకరాలు

కొనుగోలు కేంద్రాలు: **300**

ధాన్యం సేకరణ లక్ష్యం **3.68**లక్షల మెట్రిక్‌టన్నులు

ఇప్పటివరకు కొనుగోళ్లు **30**వేల క్వింటాళ్లు

అవసరమైన గన్నీసంచులు **1.06**లక్షలు



రాఘవాపూర్‌లో ధాన్యం ఆరబెదుతున్న రైతు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం కేంద్రాలు ప్రారంభించినా.. తూకం పనులు ఊపందుకోలేదు. దాదాపు 15రోజులుగా రైతు కుటుంబాలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నాయి. అసలే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండగా.. మరోవైపు అకాల వర్షాలు భయపెడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 3.68లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారయంత్రాంగం అంచనా వేయగా.. ఇప్పటి వరకు కేవలం 30వేల క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు.

ఊపందుకోని కొనుగోళ్లు

జిల్లావ్యాప్తంగా ఉన్న 14మండలాల్లో యాసంగి సీజన్‌లో 2.05ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు కాగా, అందులో 15వేల ఎకరాలు విత్తనపంటగా ఉంటుందని అధికారులు నిర్ధారించారు. దీంతో ఈ సీజన్‌లో 3.68లక్షల మెట్రిక్ టన్నుల పంటదిగుబడులు చేతికందుతాయని వ్యవసాయశాఖ అధికార వర్గాలు అంచనాకు వచ్చాయి. ఇందుకోసం 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలు ప్రారంభమైనా తూకం మాత్రం ముందుకు సాగడంలేదు. దీనికితోడు వానలు కురవడంతో పరిస్థితి ఇంకా దారుణంగా తయారైంది. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంరాశుల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సివస్తోంది.

కోటి 6 లక్షల గన్నీసంచులు అంచనా

జిల్లాలో పండించిన ధాన్యం కొనుగోలుకు కోటి 6లక్షల గన్నీసంచులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. మిల్లర్ల వద్ద 8లక్షలు, కొత్త సంచులు 56లక్షలు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి గన్నీసంచులు తెప్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

వెంటనే కొనుగోలు చేయాలి



కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. 15రోజుల నుంచి ఇక్కడనే ఉంటున్న. వాన పడడంతో వడ్లన్నీ తడిసినయ్. వాటిని ఆరబెట్టేతందుకు మల్ల తిప్పలు పడ్డం. ఇంకా మొగులు వస్తుండడం ఇబ్బందిగా ఉంది. వెంటనే వడ్లు కొనాలి. – అడిచెర్ల పద్మ, రాఘవాపూర్

వరుణుడు కరుణిస్తేనే...

ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు కేంద్రాలన్నీ ప్రారంభమయ్యాయి. వర్షాలు కురిసి వాతావరణం అనుకూలించకపోవడంతోనే కొనుగోళ్లు మందగించాయి. ఇప్పటివరకు 30వేల క్వింటాళ్లు కొనుగోలు చేశాం. వాతావరణం అనుకూలించి ఎండకొడితే కొనుగోళ్లు ఊపందుకుంటాయి. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. –వెంకటేశ్, డీఎస్‌వో



వైభవోపేతం.. శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ముప్పిరితోటలోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం, బలిహరణం, ధ్వజారోహణం చేశారు. ఈ రథోత్సవంలో శాసనమండలి చీఫ్‌విప్ తానిపర్తి బానుప్రసాదరావు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి , బీజేపీ నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య హాజరయ్యారు.

ఎలైట్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పట్టణంలోని కమాన్ నుంచి హైదరాబాద్ వెళ్లే దారిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలైట్ కిడ్నీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ కరీంనగర్ వైద్యానికి కేరాఫ్‌గా మారిందని, గతంలో హైదరాబాద్‌లో మాత్రమే అందే సేవలు ఇప్పుడు కరీంనగర్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్న వైద్యులను అభినందించారు. రాబోయే రోజుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని నిరుపేదలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్ రావు, మాజీ మేయర్ డి.శంకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 30 మంది తమ పాఠశాలలోనే ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. అందరూ కలిసి భోజనం చేసి, రోజంతా సందడి సందడిగా గడిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేల్పుల సరోజన, ఐలయ్య, ప్రధానోపాధ్యాయుడు రాజమల్లయ్య, ఉపాధ్యాయుడు గడ్డం మల్లయ్య, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై హామీ ఇవ్వాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి గోదావరిఖనికి వస్తున్నందున కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపునకు హామీ ఇవ్వాలన్నారు. చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో 18 రోజుల సమ్మె సందర్భంగా జీవో నం.22 అమలుకు యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదన్నారు. సింగరేణిలోని ఖాళీ క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని, లాభాల వాటా లేదా 20 శాతం బోనస్ చెల్లించాలని కోరారు. సమావేశంలో నాయకులు మధు, వేల్పుల కుమారస్వామి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి గారూ.. సమస్యలు పరిష్కరించండి'

గోదావరిఖని(రామగుండం): సమస్యలపై ప్రజాప్రతినిధులను నిలదీస్తే అక్రమంగా నిర్బంధాలు చేస్తున్నారని సీపీఐ నాయకుడు మద్దెల దినేష్ ఆరోపించారు. ఈ మేరకు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. అర్హులైన వారికి దళితబంధు అమలు చేయాలని, అన్ని డివిజన్లలో కొత్త రోడ్లు వేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించాలన్నారు. ప్రధాన రహదారుల వెంట సర్వీస్ రోడ్డు వేసి, ప్రమాదాలను నివారించాలని, గోదావరి నదిలో మురికి నీరు కలకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రామగుండం నగర పాలక సంస్థను రామగుండం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (రుడా)గా మార్చి, అభివృద్ధి చేయాలని, లక్ష్మీనగర్‌లోని దుకాణాల సముదాయాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతం చుట్టూ రింగ్‌రోడ్డు వేయాలని, ఐటీపార్కు ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, మాఫియాపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉద్యోగాల కోసం రూ.లక్షలు వసూలు చేసిన వారి ఆస్తులను జప్తు చేసి, బాధితులకు డబ్బులు తిరిగి ఇప్పించాలన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు మారుపేర్లను మార్చాలన్నారు. జనగామ గ్రామాన్ని 2వ టౌన్ నుంచి 1వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. గోదావరిఖనిలో మహిళా పోలీస్‌స్టేషన్, ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: స్థానిక 12వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రా ష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న ప్రజాహిత, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో నాయకులు బుర్రి వెంకటేశ్‌తోపాటు మరో 10 మంది ఉన్నారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నాయకులు బొడ్డు రవీందర్, మాదాసు రామమూర్తి, బెంద్రం రాజిరెడ్డి పాల్గొన్నారు.

జంక్షన్లను సుందరంగా తీర్చిదిద్దుతాం



సుందరంగా తీర్చిదిద్దిన తెలంగాణ చౌక్



ట్రయల్ రన్ పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్
- తెలంగాణ చౌక్‌లో ట్రయల్ రన్ పరిశీలన

కరీంనగర్: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత కరీంనగనర్‌ను రెండో అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ చౌక్‌లో రూ.1.20 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన జంక్షన్ ట్రయల్ రన్‌ను నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూడళ్లలో నగరవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఆధునిక డిజైన్లతో 13 కొత్త ఐలాండ్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో కూడళ్ల నిర్మాణం పూర్తి చేసి, 13 జంక్షన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నారని తెలిపారు. నగరంలోని ప్రధాన అంతర్గత రోడ్లతోపాటు కూడళ్లను స్మార్ట్‌గా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. నాకా, ఆర్అండ్‌బీ చౌరస్తా వద్ద కూడళ్లను ఆధునీకరిస్తామని చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని, సదాశివపల్లి వద్ద కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు బీటీ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, జంగిలి సాగర్, దిండిగాల మహేశ్, గుగ్గిళ్ల శ్రీనివాస్ , బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

- ఒకరి దుర్మరణం.. నలుగురికి తీవ్ర గాయాలు
- కురిక్యాల శివారులో ఘటన





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు



అజయ్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి)/వేములవాడ: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అభిలాష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లికి చెందిన సోమినేని భూమయ్య–భారతి దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు అజయ్(40) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య సాయిరక్షిత, ఎనిమిదేళ్ల కూతురు, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం తన కుటుంబసభ్యులతో కలిసి గంగాధరలో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. అనంతరం కరీంనగర్‌కు వెళ్లి వస్తానని, ఇక్కడే ఉండాలని కుటుంబీకులను చెప్పి, కారులో బయలుదేరాడు. అదే సమయంలో వైరాగి అభిషేక్, తన ముగ్గురు కుటుంబసభ్యులతో కలిసి కొమురవెల్లి నుంచి కొండగట్టుకు కారులో వెళ్తున్నాడు. గంగాధర మండలంలోని కురిక్యాల శివారు కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రెండు వాహనాలు వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కారులో ఉన్న అభిషేక్, ఇద్దరు మహిళలు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అభిలాష్ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సన్మానిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): కర్ణాటక రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో డీసీసీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుల్బర్గాలో జరిగిన బహిరంగ సభకు హాజరయ్యారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సన్మానించారు.